క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

మాగనూర్: ఉపాధిహామీ పథకంలో భాగంగా మండలంలో పండ్లతోటల పెంపకంకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏపీఓ సత్యప్రకాష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరాఖాస్తుకు ఆధార్‌కార్డు, ఉపాధిజాబ్‌కార్డు, బ్యాంకు ఖాతాబుక్, పట్టాపాస్ బుక్, పంచాయతీ తీర్మానం, సాగుచేసే భూమిలో బోర్‌కు సంబంధించిన డ్రిప్‌కోసం కావాల్సిన కులధృవీకరణ పత్రాలను ఇవ్వాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, బీసీ, ఇతరులకు 90శాతం డ్రిప్ సబ్సిడీ సౌకర్యం ఉందన్నారు. వివరాలకోసం 9281486046కు సంప్రదించాలన్నారు.

రేపటి నుంచి గాలికుంటు టీకాలు

మాగనూర్: ఈనెల 31నుంచి మండలంలోని అన్నిగ్రామాల్లో పశువైద్య సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేయనున్నట్లు మండల పశువైద్యాధికారి వంశీకృష్ణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ పశువులకు తప్పకుండా టీకాలు వేసుకొని వ్యాధులబారిన పడకుండా చూసుకోవాలని ఆయన కోరారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

కోస్గి: ఉపాధికల్పించేందుకు ఏర్పాటుచేసిన మగ్గం, అల్లికల శిక్షణశిబిరాన్ని మహిళలు, నిరుద్యోగ యువతులు సద్వినియోగం చేసుకోవాలని స్వచ్ఛంద సంస్థ కో-ఆర్డినేటర్ సత్తయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ప్రజ్ఞాజూనియర్ కళాశాలఎదుట సింధూ డయాగ్నోస్టిక్ భవనంపై ఈనెల 31నుంచి ఉచితభోజనం, మెటీరియల్ సౌకర్యాలు కల్పించి శిక్షణఇస్తారని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9949104515 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

సన్నాహక సదస్సు విజయవంతం చేయాలి

నారాయణపేట టౌన్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ అమలుకోసం నిర్వహించే సన్నాహక సదస్సు విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ రాష్ట్ర నాయకులు డీకె నర్సింహ మాదిగ, మండల నాయకులు హన్మంతు మాదిగ పేర్కొన్నారు. ఈ నెల 30న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లకు ఆదివారం 11గంటలకు చంద్రగార్డెన్‌లో నిర్వహించే సన్నాక సభకు ముఖ్యఅతిథిగా మందకృష్ణ మాదిగ హాజరవుతున్నారన్నారు. ఎమ్మార్పీస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అవినీతిపై చర్చకు సిద్ధమా

నారాయణపేటటౌన్: ఎమ్మెల్యే అవినీతిపై చర్చకు బీఆర్ఎస్ నాయకులు సిద్ధమా అని కేంద్రప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ శనివారం ఒక ప్రకటనలో సవాల్ చేశారు. జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలు ఇసుక, మట్టి మాఫియా నడిపిస్తూ అవినీతి రాజ్యం నెలకొల్పారన్నారు. స్థానిక ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి రాయిచూర్‌లో విద్యాసంస్థల ద్వారా దోపిడి చేస్తుంటే, మక్తల్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి జిల్లా కేంద్రంలో విద్యాసంస్థతో దోపిడి చేస్తున్నారని ఆరోపించారు.

సీడీపీఓ వేధింపులపై ఫిర్యాదు

కోస్గి: అంగన్‌వాడీలను సీడీపీఓ వేధింపులకు గురిచేస్తూ మెమోలు జారీచేశారని, ఈ విషయంలో న్యాయం చేయాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు శనివారం ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే అప్పటికప్పుడు పీడీతో ఫోన్‌లో మాట్లాడుతూ.. వెంటనే సీడీపీఓను మార్చాలని, ఒకరిద్దరు తప్పుచేస్తే అందరికి మెమోలు ఇవ్వడం సరికాదని సూచించారు. ఈ విషయంలో అంగన్‌వాడీలతో సమావేశమైన ఎమ్మెల్యే సంబంధిత మంత్రితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీచ్చారు. సమావేశంలో మద్దూర్ ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు, ఆయాలు తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న సమ్మె

మద్దూరు: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నా శనివారానికి 24వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ ప్రజాపంథా నాయకుడు నర్సింహులు మాట్లాడుతూ.. ఇన్నిరోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్న ప్రభుత్వం నుంచి ఏలాంటి స్పందన లేకపోవడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో బీములు, మహిపాల్, రాములు, జైనోద్దీన్, ఇక్బాల్, చిన్నమ్మ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించే వరకు పోరాటం

దేవరకద్ర: సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మెను కొనసాగిస్తామని గ్రామ పంచాయతీ కార్మికులు హెచ్చరించారు. శనివారం 24వ రోజు సమ్మెలో భాగంగా దేవరకద్ర మండల పరిషత్ కార్యాలయం ముందు కార్మికులు ధర్నా నిర్వహించి నినాదాలు చేశారు. తమ ఉద్యోగాలను పర్మినెంట్ చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ జిల్లా కార్యదర్శి సాంబశివుడు, నాయకులు వెంకట్రాములు, ఆశన్న బుగ్గన్న, అంజనేయులు, వెంకటయ్య, ఏసు, బాలరాజు, స్వాతి, లక్ష్మీ, నాగమ్మ పాల్గొన్నారు.



బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు



సంజీవరాయ చౌరస్తాలో పీర్ల ఊరేగింపు

భక్తిశ్రద్ధలతో పీర్ల పండుగ



గోటూర్‌లో ట్రాక్టర్‌పై ఊరేగిస్తున్న భక్తులు



మాధవరం మసీదు ఎదుట అలాయ్ బలాయ్ ఆడుతున్న గ్రామస్తులు

దామరగిద్ద: మండలంలోని దామరగిద్ద, కాన్‌కుర్తి, క్యాతన్‌పల్లి, మొగుల్‌మడ్క, లోకూర్తి, మల్‌రెడ్డిపల్లి, సజనాపూర్ తదితర గ్రామాల్లో పీర్లపండగ ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. బుక్కదేవుడు, ఉషేన్‌సాహేబ్ కతల్ సహేబ్ పీర్ల ఊరేగింపు నిర్వహించారు. దామరగిద్దతోపాటు ఆయా గ్రామాల్లోని చావిడిల వద్ద అలాయ్, బలాయ్ మహిళల బొడ్డెమ్మ పాటలతో ఆనందంగా గడిపారు. పీర్ల ఊరేగింపులో అలాయ్ ఆడారు. ఉత్సవాల్లో ఆడపడుచులు, యువకులు పాల్గొన్నారు.

మరికల్: మండలంలో శనివారం గ్రామస్తులు ఘనంగా మొహర్రం నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లు అలాయ్, బలాయ్ తీసుకున్న అనంతరం మాధవరంలో యువకులు అలాయ్ ఆడుతు అలరించారు. మహిళలు బొడ్డెమ్మలు వేస్తు మొహర్రం వేడుకలను జరుపుకున్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో పీర్ల సవారీ ఉత్సవాలు శనివారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం డప్పులు వాయిస్తు పూరవీధుల గుండా పీర్ల సవారీగా ఉరేగించారు. అనంతరం మహిళలు బొడ్డెమ్మలు వేయగా పురుషులు అలాయ్, బలాయ్ ఆడుతూ నృత్యాలు చేశారు. అలాగే గోటూర్‌లో పీర్లపండగా ఘనంగా కొనసాగింది. గతమూడురోజులుగా పీర్లఉత్సవాలు కొనసాగిస్తున్నారు.

మద్దూరు: మండలంలోని శనివారం నిడ్జింత, మద్దూరు, పల్లెర్ల, దమగ్నపూర్, ఖాజీపూర్, రెనివట్ల, భూనీడ్, తదితర గ్రామాల్లోని పీర్ల చావడిల వద్ద ప్రతిష్ఠించిన పీర్లకు కులమాతాలకతీతంగా పూజలు చేశారు. సవారి సందర్భంగా కోట్లలోని పీర్ల చావాడిలో పెద్దఎత్తన యువకులు అలాయ్, మహిళలు బొడ్డెమ్మలు ఆడారు. భక్తులు పోట్టేళ్ల, మేకలతో పీర్లకు గ్యార్వీలను నిర్వహించారు. అనంతరం పీర్లు నిమజ్జనానికి తరలివెళ్లాయి.



మత పెద్దలతో మాట్లాడుతున్న ఎస్పీ వెంకటేశ్వర్లు

బందోబస్తు పరిశీలన

నారాయణపేట రూరల్: జిల్లాకేంద్రంలో జరుగుతున్న మొహర్రం వేడుకలకు సంబంధించి అవసరమైన భద్రతా ఏర్పాట్లను ఎస్పీ వెంకటేశ్వర్లు శనివారం సాయంత్రం స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా పీర్ల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముస్లిం మత పెద్దలతో కలిసి మాట్లాడారు. పోలీసులకు భద్రతా పరమైన సూచనలు చేశారు. అలాగే ఏఎస్పీ నాగేంద్రుడు సైతం పర్యటించి పర్యవేక్షించారు. పీర్లను దర్శనం చేసుకుని, భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. భద్రతా చర్యల్లో భాగంగా డాగ్, బాంబు స్క్వాడ్ బృందాలు పీర్ల చావిడి, ప్రధాన చౌరస్తాల్లో తనిఖీలు చేశాయి. వారి వెంట డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రవిబాబు, ఎస్ఐలు ఉన్నారు.

నర్వ: గతవారం రోజులుగా ఆయా గ్రామాల్లో కొలువుదీరిన పీర్లు శనివారం రాత్రి వరకు ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్వ, పెద్దకడ్మూర్, రాయికోడ్, రాంపూర్, బెక్కర్‌పల్లి, కల్వాల్, కొత్తపల్లి గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం చావిడీల వద్ద ప్రజలు పెద్దఎత్తున గుముగూడి పీర్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పీర్లను బావుల వద్దకు తీసుకెళ్లి ముగింపు పలికారు.



పీర్ల వద్ద అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు



ధన్వాడలో పీర్లవద్ద పూజలు చేస్తున్న నాయకులు



ఊట్కూర్‌లో ఊరేగుతున్న పీర్లు

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



భవన నిర్మాణపనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

మాగనూర్: సీఎం కేసీఆర్ గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని నేరడగందొడ్డి, అమ్మపల్లి గ్రామాల్లో రూ.20 లక్షలతో పంచాయతీ భవననిర్మాణానికి భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పట్టణాలకు దీటుగా అభివృద్ధి చెందాలని లక్ష్యంతో చిన్న గ్రామ పంచాయతీలను ఏర్పాటుచేసి భవనాల నిర్మాణానికి శ్రీకారం చూట్టారని తెలిపారు. అందులో భాగంగా పంచాయతీ భవనం నిర్మించుకుంటున్నామని, త్వరగతిన పనులుపూర్తిచేసి పంచాయతీ భవనాన్ని అందుబాటులో తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తారమ్మ, పద్మమ్మ, ఎంపీపీ శ్యామలమ్మ, వైస్‌ఎంపీపీ తిప్పయ్య, ఎంపీటీసీ ఎల్లారెడ్డి, సుదర్శన్‌గౌడ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, సర్పంచ్ నర్సింహులు, మల్‌రెడ్డి, ఆశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

ఊట్కూరు: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎర్గట్‌పల్లి, వల్లంపల్లి గ్రామాల్లో నూతన పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు.. గ్రామ పంచాయతీలుగా ఏర్పాటుచేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జెడ్పీటీసీ అశోక్‌గౌడ్, మాజీ జెడ్పీటీసీ అరవింద్‌కుమార్, సర్పంచ్‌లు మల్లిఖార్జున్, నర్సప్ప, శేఖర్‌రెడ్డి, వెంకటనారాయణ, రాములు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు త్వరగా పూర్తిచేయాలి

కోస్గి: మున్సిపల్ పరిధిలోని ప్రధాన రహదారి రోడ్డువెడల్పు పనుల్లో భాగంగా నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణపనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో పర్యటించి ఆయా కాలనీల్లో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మున్నూర్ వీధిలో నూతన కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.30 లక్షల నిధులు, ముదిరాజ్ కమ్యూనిటీ భవన నిర్మాణ కోసం రూ.30 లక్షలు మంజూరుచేస్తామని, పనులు వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానిక నాయకులకు సూచించారు. అనంతరం మొహర్రం సందర్భంగా పట్టణంలోని పీర్లపండుగలో పాల్గొని పూజలు చేశారు. మున్సిపల్ అధ్యక్షుడు రాజేష్, ఎంపీపీ మధుకర్‌రావు, జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ శ్యాసం రామకృష్ణ, భీంరెడ్డి, వేణుగోపాల్, వెంకట్‌నర్సింహులు, ఓంప్రకాష్ పాల్గొన్నారు.



ప్రధాన రోడ్డులో డ్రెయినేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

సమాజాభివృద్ధికి చేయూతనివ్వాలి

కోస్గి: ప్రతిమనిషి సేవా కార్యక్రమాలతో సమాజాభివృద్ధికి చేయూతనివ్వాలని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి సూచించారు. స్థానిక ఏబీకే గార్డెన్స్‌లో లయన్స్‌క్లబ్ ఇన్‌స్టాలేషన్‌కు హాజరై మాట్లాడారు.. ప్రతి ఒక్కరూ తమ చేతనైనంతలో తోటివారికి సహాయ సహకారాలు అందించాలన్నారు. సేవాకార్యక్రమాలు చేయడం ద్వారా గుర్తింపుతోపాటు పుణ్యఫలం లభిస్తుందన్నారు. అనంతరం నూతన లయన్స్‌క్లబ్‌శాఖను ఎన్నుకోగా ఇన్‌స్టాలేషన్ అధికారి లయన్ నటరాజ్ నూతన కమిటీతో ప్రమాణస్వీకారం చేయించారు. అధ్యక్షుడిగా బెజ్జు వెంకట్రాములు, లయన్స్‌క్లబ్‌శాఖ అధ్యక్షుడిగా బెజ్జు వెంకట్రాములు, కార్యదర్శిగా మహేందర్‌గౌడ్, కోశాధికారిగా శంకర్‌ను ఎన్నుకున్నారు. ఆఫీసర్ మృత్యుంజయ, రిజియన్ చైర్‌పర్సన్ శ్రీనివాసులు, జోన్ చైర్‌పర్సన్ గోవర్ధన్, ఈవెంట్ చైర్మన్‌లు అన్న కిష్టప్ప, రాఘవరెడ్డి, వార్ల విజయ్‌కుమార్, ప్రకాష్‌రెడ్డి, చల్ల వెంకటేశం, గందె ఓంప్రకాష్, కృష్ణగౌడ్, వీరేశలింగం పాల్గొన్నారు.

బాధితులను ఆదుకుంటాం



బాధితలకు సాయం అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గ పరిధిలో అకాల వర్షాలకు ఇళ్లుకూలిపోయిన బాధిత కుటంబాలను ఆదుకుంటానని బీఆర్ఎస్ నాయకుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని వర్షానికి ఇళ్లు కూలిపోవడంతో విషయం తెలుసుకున్న బాధిత కుటుంబాల ఇళ్లను పరిశీలించారు. బాధితులకుసాయం చేసేందుకు సొంతడబ్బులు రూ.10లక్షలు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం 12 వవార్డులో ఇళ్లకూలిపోయిన బాధి తులకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు నగదుతోపాటు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

మణిపూర్ ఘటనపై బాధ్యత వహించాలి



నిరసన చేస్తున్న నాయకులు

నారాయణపేట టౌన్: ఇటీవల మణిపూర్‌లో జరిగిన ఘటనపై బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి హన్మంతు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్లకార్డులతో ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ.. మహిళలను నగ్నంగా ఊరేగించి హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పండుగ సాయన్న జయంతి

నారాయణపేట టౌన్: స్థానిక సత్యనారాయణ చౌరస్తాలో శనివారం పండుగ సాయన్న జయంతి సందర్భంగా ముదిరాజ్ పట్టణ అధ్యక్షుడు మిర్చి వెంకటయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా హాజరై ముదిరాజ్ సంఘం జిల్లాఅధ్యక్షుడు నాగరాజ్ మాట్లాడారు. ముదిరాజ్‌లు రాజకీయంగా ఆర్థికంగా బలపడాలని, అందరూ సమిష్టిగా కృషిచేస్తే స్థిరపడవచ్చని అన్నారు. కార్యక్రమంలో కాకర్ల భీమయ్య, రాములు, అప్పంపల్లి రాములు, కృష్ణ, కొనంగేరి హన్మంతు, వెంకట్, సంతోష్ కుమార్, లింగప్ప, కార్తీక్, వినోద్, రవి పాల్గొన్నారు.



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

రుణాలు ఏకకాలంలో మాఫీ చేయాలి



సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: ప్రభుత్వం రైతు రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని కోటకొండలో ఆ సంఘం సభ్యత్వనమోదు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేస్తామని అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు దాటినా అమలు చేయలేదని విమర్శించారు. ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ పరికరాలు సబ్సిడీపై ఇవ్వాలన్నారు. కేంద్రం సైతం స్వామినాథన్ సిఫారసులకు అనుగుణంగా మద్ధతు ధరల చట్టం చేయాలన్నారు. కార్పొరేట్ వ్యవసాయచట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనలో ఇచ్చిన హామీ నెరవేర్చాలన్నారు. కార్యక్రమంలో కాశన్న, దామోదర్, వెంకటయ్య, వెంకట్రాములు, కృష్ణ, దస్తప్ప, తాయప్ప, కురుమప్ప, శేఖర్, రవి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా రెడ్డి సేవాసమితి

దేవరకద్ర: పేదలకు అండగా రెడ్డి సేవాసమితి కార్యక్రమాలు నిర్వహిస్తోందని జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి అన్నారు. శనివారం దేవరకద్రలో నియోజకవర్గ సమావేశంలో మాట్లాడారు. మరిన్ని కార్యక్రమాలు నిర్వహించడానికి సహకరించాలని కోరారు. అదేవిధంగా ఎన్నికల ఇన్‌చార్జ్, జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మల్లు నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మండల, పట్టణ కమిటీల అధ్యక్షులను ఎన్నుకున్నారు. నాయకులు సుధాకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇంద్రసేనా రెడ్డి

కొనసాగుతున్న నిరవధిక దీక్షలు



దీక్షలో సాధనసమితి సభ్యులు

నారాయణపేట రూరల్ : మండలంలోని కోటకొండలో 81వ రోజు నిరసన దీక్షలు కొనసాగాయి. శనివారం సాధన సమితి సభ్యులు దీక్షలో కూర్చోగా వారికి దండలు వేసి దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రాజకీయ దురుద్దేశంతో కోటకొండను మండలంగా ప్రకటించడంలేదని విమర్శించారు. నియోజకవర్గంలో మూడు ప్రాంతాలను మండలాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యాదగిరి, చెన్నప్ప, ప్రవీణ్, రాములు, నర్సింహులు, వెంకట్రాములు పాల్గొన్నారు.

వర్షానికి అధ్వానంగా రోడ్డు



కూరుకుపోవడంతో ఆటోను తోస్తున్న యువకులు

మద్దూరు: మండలంలోని చంద్యానాయక్ తాండాకు వెళ్లేరోడ్డు అధ్వానంగా తయారైంది. గతవారం వర్షాలకు రాకపోకలు సాగించేని విధంగా మారింది. వర్షపు నీరునిలిచి గుంతలు ఏర్పడి ద్విచక్రవాహనాలకు రాకపోకలు సాగించడానికి వీల్లేకుండా పోయింది. అత్యవసర సమయాల్లో 108 అంబులెన్స్ వెళ్లలేని పరిస్థితి నెలకొంది. బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని తాండావాసులు శ్రీను నాయక్, సంజునాయక్, సంతోష్, రుప్‌సింగ్ నాయక్ కోరుతున్నారు.

వంతెన మరమ్మతులు వెంటనే చేపట్టాలి

మాగనూర్: కృష్ణానదిపై ఉన్న పురాతన వంతెన వర్షాల కారణంగా పూర్తిగా దెబ్బతిన్నదని, శిథిలావస్థకు చేరిన వంతెనను మరమ్మతుపనులు చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం ధర్నా కార్యక్రమం రెండోరోజు కొనసాగించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. వంతెనపై ప్రయాణం అంటేనే ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా మారిందన్నారు. తెలంగాణ ప్రాంతంనుంచి అత్యధికంగా ఆస్పత్రిపనులపై కర్ణాటక రాష్ట్రంలోని రాయచూర్‌కు నిత్యం పదుల సంఖ్యలో ప్రజలు ప్రయాణం సాగిస్తుంటారని అత్యవరస సమయంలో అంబులెన్స్ వంతెన దాటేందుకు ఇబ్బందులు పడాల్సివస్తుందని తెలిపారు. అధికారులు స్పందించి త్వరగతిన వంతెన మరమ్మతుపనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజప్పగౌడ, నర్సింహులు, కృష్ణమూర్తి, నాగేందర్, గోవర్ధన్, ఓబులేష్, అన్వర్, రవికుమార్ పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్‌నాయకులు